కథానిక

# సానుభూతి

శ్రీమతి నాయని కృష్ణకుమారి

కాశేశ్వర్రావు కళ్ళింకా నవ్వుతూనే ఉన్నయ్ చుట్టూ అదొక రకపు వాతావరణం! శ్మశానాల్లో చితి మండుతున్నప్పుడుండాల్సిన వాతావరణం। సానుభూతి వాక్యాలూ, గుణగణనలూ గాలిలో కరిగి ఆవిరై అక్కడ చేరిన ప్రతివాడి హృదయాన్ని కొలిచి గీరలు పెడ్తున్నయ్ కాశేశ్వర్రావు చచ్చిపోయినందుకు అక్కడ ఏడుస్తున్న వాళ్ళెవరూలేరు ఏడవటానికి అతగాడికి భార్యా, పిల్లలూ, తల్లీ తండ్రీ యిట్లాంటి బంధువర్గ మేమీలేదు — ఒకవేళ ఉండి పీడ్చినా ఆ విచారంముద్ర మనుష్యులమీద ఎంత సేపని పనిచెయ్యగలదు? లోకంలో మనిషితో మనిషి కున్న సంబంధమే విచిత్రమైంది ఎదురుగుండా ముక్కున ఆకాస్త ఊపిరితో తిరుగుతున్నంత సేపూ అందరు ఆప్యాయంగా "మాట్లాడుతారు, నీవులేందే మేంమాత్రం ఎందుకూ" అని ముఖం గంభీరంగా పెట్టి నిజమేనేమో అన్నట్లు చెప్తారు కాని చివరికి ఆలోకంనుంచి ఆహ్వానం వచ్చి వెళ్ళిపోయిననాడు అతనెవరో వీళ్ళెవరో! మనుష్యుల నాలుకలు తాటిపట్టలా, మరేమన్నానా?

కాశేశ్వర్రావు విషయంలో బ్రతికి నన్నాళ్ళూ అంత ఆప్యాయతచూపించినవాళ్లేలేరు ఈపీడ ఎప్పుడు పోతుందా అని తిట్టుకున్నవాళ్ళు చాలామంది కాని వాళ్ళే యిప్పుడు కాశేశ్వర్రావు సగం మూసిన కళ్ళతో చలనం లేకుండా నవ్వుతూంటే వాడు వినడం లేదుకదా అని సానుభూతి వాక్యాలు పలుకుతున్నారు వాళ్ళయిష్టం వచ్చినట్లు జాలి నంతా ఒలకబోసి పెద్దరికాన్ని ప్రదర్శించు కుంటున్నారు

"పాపం! ముక్కుసూటిగా పోయే వ్యక్తిరా' ఆసూటి దన్నాని లోకం హర్షించలేకపోయింది గాని!" ఒక డన్నాడు వాడికి ఈ లోకానికి ఏమీ సంబంధం లేనట్లు వాడీ లోకంనుంచి పూర్తిగా వేరై మడిగట్టుకుని కూర్చున్న ఒక మహావ్యక్తి అయినట్లు! — కాశేశ్వర్రావే బ్రతికి ఉంటే యీమనిషి ఇట్లా తన్ను గురించి జాలి ఒలక బోస్తున్నందుకు చీదరించి మోహాన ఉమ్మివేశేవాడు

"వాడి తత్త్వమేఅంత '— నేనెన్ని సార్లు చెప్పే వాణ్ణి? చెప్పినప్పుడల్లా విని మనస్సు మార్చుకునేవాడు మళ్ళీ తర్వాత వాడివాలకం వాడిదే। ఎవరో చెడు సావాసాలు పట్టిగాని లేకపోతే కాశేశ్వర్రావు నాచేతుల్లో మైనం తిరిగినట్లు తిరిగేవాడు! —" ఈమాటలు అనంతమూర్తి అంటుంటే, అతడి కళ్ళు కాశేశ్వర్రావు శవంవేపు తేరి చూడనైనా లేకపోయినయ్ — చూడటానికి వాటికి తాహతు, లేదనిచూస్తూ ఉన్నవాళ్ళకు తెలిసినా తెలియక పోయినా ఆకళ్ళకు తెలుసు తెలుసుకునే శక్తేఉంటే ఆ శవానికీ తెలిసేది.

అనంతమూర్తీ కాశేశ్వర్రావూ లోకంద్రుష్టిలో స్నేహితులనే చెప్పాలి కాశేశ్వర్రావు దృష్టిలో మాత్రం స్నేహితులనే పదానికి అర్థమేలేదు "స్నేహమంటే ఏమిటోయ్! ఒకడికి రెండోవాడి సహాయం కావలసివస్తే స్నేహమనే రంగుపూసుకు వస్తాడు కళ్ళుజిగేలు మనిపించే అరంగు వెనక, అంతా అసహ్యంగా బూజూ, మసకా' నాతో ఈతలకాయ నొప్పిమాటలు చెప్పకండి'" అని గసిరేవాడు వాడట్లా కుంచబద్దలు కొట్టినట్లు అంటాడని మిత్రులకంద రికీకోపం' అనంతమూర్తి కాకోపం మరింత హెచ్చు స్థాయిలోకి వెళ్ళేది అయినా అసమర్థుడి కోపానికి విలువేమిటి?

ఒకరోజున అనంతమూర్తి వచ్చాడు కాశేశ్వర్రావు ఆ స్నేహితుడు కాని స్నేహిణ్ణి కూర్చోపెట్టి కుశలా లడిగాడు

"ఏమిటోయ్ ఎండవేళ ఇటుపడివచ్చావ్?—" బయట ఎండ ఇళ్ళంటిస్తున్నట్లు, పెంకులు టప టపలాడిస్తున్నట్లు, రాజ్యం చేస్తున్నది అనంతమూర్తి మొహంకూడా బయటి ఎండలాగే ధుమ ధుమలాడి పొగలు రేగాలనుకుంది -కాని రేగలేదు అనంతమూర్తి వెంటనే నోరు మెదపలేక పోయాడు కాశేశ్వర్రావు మళ్ళీ అడగలేదు అట్లా అడ

గడం అతని స్వభావమేనాకాదు. కోపంతో మండిపోతున్నా ననుకునే అనంతమూర్తి అతని దగ్గర చేతగాని దద్దమ్మలా అనిపించాడు కొన్ని నిముషాలు గడిచినయ్ "నీతో మహాచెడ్డచిక్కొచ్చి పడిపోయిందోయ్—" మనస్సులో ఉన్న ఉక్రోషమంతా పుక్కిటికి వచ్చి నీళ్ళుగా మారినట్లూ, అది నమలడానికి పంటి కిందికి రాక అవస్థ పడుతున్నట్లూ అనంతమూర్తి మొహం వికృత మైంది.

"ఏం !" — తాపీగా అన్నాడు కాశేశ్వర్రావు "నన్ను గురించి అందరితో ఏమో చెప్తున్నావట !" — బాగా కసిరాననుకున్నాడు అనంతమూర్తి వీడికి సహజంగా నటించడమైనా చేతగాదనుకున్నాడు కాశేశ్వర్రావు

"నేను పిరికివాణ్ణా? ఆత్మగౌరవం లేనివాణ్ణా? ఎంత సేపూ నాబాగుకోసం పాకులాడే వాణ్ణా? ఇంకా" —

"ఛట్ !"— కాశేశ్వర్రావు గొంతు ఉరిమింది. **అనంతమూర్తి ఆగిపోయాడు.**

"ఈమాట అడగడానికి ఇంతదూరం ఎండలో పడి వచ్చావా?"

"కాదనుకో" —నసిగాడు —"ఆ నందికేశ్వర్రావుతో నీకెప్పుడు స్నేహం కలిసింది? —"

"ఏం!"

"వాడే చెప్పాడు — వాడుత్త వెధవ !"

"నీకంటేనా?" కాశేశ్వర్రావుగొంతు తుపాకిగుండులా దూసుకు వచ్చింది. దనికి అనంతమూర్తి కేంజవాబు చెప్పాలోతెలియలేదు నందికేశ్వరరావు పరమదుర్మార్గుడు, లుచ్చా, కాస్తో కూస్తో చాటుగా తాగుతాడట ! లోకంలో మనిషి కుండాల్సిన అవగుణాలన్నీ వాడి కున్నాయని అందరూ అనుకుంటారు, తనకూ వాడికీ పోలికేమిటి? తాను వాడి కంటే లక్ష రెట్లు మేలని తెలిసే కాశేశ్వర్రావు ప్రశ్న కేం జవాబు చెప్పాలో తెలియలేదు పైపెచు, కళ్ళల్లో నీళ్ళు తిరిగి తల దించుకున్నాడు

వీపు మీద టప్ మని బోలు అరచెయ్యి సీమ టపా కాయలా పేలింది అనంతమూర్తి తలెత్తి చూచాడు కాశేశ్వర్రావు నవ్వుతున్నాడు మొహం మొహం మీద ట్టి తన రెండు కళ్ళల్లోకి చూపున్ని సూదుల్లా గుచ్చు న్నాడు

"నువ్వు పిరికివాడివి కాదర్రా భాయీ !" ఇంకోదెబ్బ పడ్డది వీపుమీద అనంతమూర్తి ఘాట్లాళ్ళేదు

"చచ్చు నాగన్నలు! గట్టిగా నోరు విప్పి మాట్లాడ్డం తెలీదు మనస్సుకు ఇష్టం లేని విమర్శ వస్తున్నా అడ్డు కోడం తెలీదు కన్నీళ్ళు మాన మర్యాదల్ని కాపాడ తాయిరా? పై పెచ్చు పొగొడ్త యే నందికేశ్వర్రావు దగ్గర గురుకుల వాసం చేసి నేర్చుకో ! తన మీద మాట పడ నీయడు తన హుందా తనం మాసిపోనీయడు— వాడు తాగినా, తందనా లాడినా, వాడిలా లోకమంతా తయారైతే ! " ఇంకా కాశేశ్వర్రావు అర్ధోక్తిలోనే ఉన్నాడు "లోకమంతా రౌడీలగుంపౌతుంది"అన్నాడు అనంతమూర్తి ధైర్యం తెచ్చుకుని.

"ఏడ్చావ్ !"ఉరిమాడు కాశేశ్వర్రావు. అతను మాట్లాడి తేనే అనంతమూర్తి గుండెల్లో రక్తం గూడు కడ్తుంది "నీలాంటి వెధవలకంటే అట్లాంటి రౌడీలు నయం!"

ఆమాటలకు మరొకరైతే కాశేశ్వర్రావును చంపి తను చచ్చేవాడు అనంతమూర్తి ఏమీ చెయ్యలేదు ఆఖరుకు కూర్చున్న చోటినుంచి ఒక్క అడుగైనా కదల్లేదు కొన్ని నిముషాలు వాళ్ళిద్దరిమధ్యా దీనంగా చచ్చి పోయినయ్

"ఇక పోతానురా!"— అనంతమూర్తి పెదిమలు నిర్జీవంగా కదిలినయ్

"వచ్చిన పనేదో ఏడు!"

"ఏంలేదు పది రూపాయలు అప్పు పుడుతుందేమో ననీ," అనంతమూర్తి నసిగాడు

"అప్పు!" కాశేశ్వర్రావు నరాల్లో రక్తం ఘోషించింది ఇట్లాంటి పదిరూపాయలు అప్పుల కిందే కట్టుకునుంటే అనంతమూర్తిని తాకట్టుపెట్టినా కాశేశ్వర్రావు బాకీ తీరేది కాదు

విసురుగా పదిరూపాయలనోటు అనంతమూర్తి కాళ్ళ దగ్గర పడ్డది అది కాబోయే యజమాని దీనత్వం అబ్బి నట్లే రెప రెపలాడింది అనంతమూర్తి మొహంలో తృప్తి మెరిసింది కాశేశ్వర్రావు మనస్సులో అసహ్యం మెరసింది బయట ఎండ ధుమ ధుమలాడుతూంది వేడిగాలి రివ్వుమని లోపలికి దూసుకునివచ్చి తలుపుల్ని ఫెడీలు ఫెడీలుమని కొట్టింది—

ఆ కాశేశ్వర్రావు చచ్చిపోయినా అతని అరమూసిన కళ్ళు నవ్వుతూనే ఉన్నయ్ ఆ అనంతమూర్తి సానుభూతి ప్రకటిస్తున్నా అతనిమనస్సు ఆనాటి పదిరూపాయిల కాయి తంలా రెపరెప లాడుతూనేఉంది ★